ప్రజాశక్తి
శుక్రవారం 29 నవంబర్ 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

విద్యార్థుల ప్రగతిపై

అధికారులు దృష్టి సారించాలి..

- రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు
- ముఖ్యమంత్రి చంద్రబాబు బాపట్ల పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విద్యార్థుల ప్రగతిపై బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరవుతారని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో విద్యాశాఖ కమిషనర్ బుధవారం బాపట్లకు చేరుకున్నారు. సీఎం పర్యటనపై జిల్లా కలెక్టర్‌తో చర్చించారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు హాజరయ్యే మున్సిపల్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలోని ప్రతి తరగతి గదిని కలెక్టర్ జె వెంకటమురళితో కలిసి ఆయన పరిశీలించారు. విద్యార్థుల ప్రగతి, విద్యా బోధనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని ఆయా భవనాలు, తాగునీటి వసతి, మరుగు దొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షల నిర్వహణ, హెల్త్ కార్డుల జారీ ప్రక్రియను ఆయన ▶ 2లో

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

రూ.130 కోట్లకు పైనే.!

- జీతాలు కూడా ఇవ్వలేక అవస్థలు పడుతున్న ఇంజినీరింగ్ కాలేజీలు
- విద్యార్థులను ఫీజులు కట్టాలని కొన్ని విద్యాసంస్థల ఒత్తిళ్లు
- మాటలతోనే ప్రభుత్వం కాలం గడుపుతోందని యజమానుల ఆవేదన

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఇంజినీరింగ్ కాలేజీలు ఆర్థిక చిక్కుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్ని ఇప్పటికే సంక్షోభంలో పడగా కొన్ని పేరున్న సంస్థలు అప్పోసప్పో తెచ్చి నడుపుతున్నారు. కారణం కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికీ పైసా కూడా ఫీజురీయింబర్సుమెంటు తాలూకు డబ్బులు ఇవ్వలేదు. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. లెక్చరర్లకు వేతనాలు ఇవ్వలేని స్థితిలో అనేక సంస్థలున్నాయి. ప్రభుత్వం నుంచి రీయింబర్సుమెంటు బకాయిలు రాగానే ఇస్తామని చెబుతూ కాలం గడుపుతున్నారు. కొన్ని కాలేజీలు విద్యార్థులపై ఒత్తిడి పెంచాయి. ఒంగోలులోని ప్రముఖ కాలేజీ ఫీజు కడితేనే కాలేజీకి రావాలని షరతు పెట్టింది. దీంతో పలువురు విద్యార్థులు మధ్యలోనే చదువులు మానేశారు. దీనిపై కలెక్టర్ తమీమ్‌అన్సారియా స్పందించి.. విద్యార్థులను ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటామని కాలేజీలకు ఆదేశాలిచ్చారు. కొన్ని కాలేజీలు మాత్రం అవకాశం ఉంటే ఫీజు చెల్లించాలని విద్యార్థులను కోరుతున్నాయి. ఏదేమైనా ప్రభుత్వం కారణంగానే ఇప్పుడు కాలేజీల యజమానులు, విద్యార్థులు అవస్థల్లో పడ్డారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 18 ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. ఒంగోలు, చీరాల, మార్కాపురం, కందుకూరు, చీమకుర్తి తదితర ప్రాంతాల్లో ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. సుమారు 20 వేల మంది విద్యార్థులు ఈ సంస్థల్లో చదువుతున్నారు. 90 శాతం మందికి పైగా ఫీజురీయింబర్సుమెంటుతోనే చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని యజమానులు వాపోతున్నారు. జిల్లాలో రీయింబర్సుమెంటు బకాయిలు రూ.130 కోట్లకు పైగానే ఉన్నాయని చెబుతున్నారు. గత ప్రభుత్వం ఆఖరులో కొంత నిలిపేసింది. ఇవి సుమారు రూ.95 కోట్ల వరకూ ఉంటాయని అంచనా. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే ఒక టర్మ్ పూర్తయింది. ఎవరికి ఎంత ఇవ్వాలనేది తేల్చలేదంటున్నారు. అయినా ఈ టర్మ్‌కు తాలూకు రూ.30 కోట్లకు పైగానే ఉంటాయని అంచనా. ఏదేమైనా ఈ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిందే. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు కూడా ఇవ్వాలి. లేకుంటే చాలా కాలేజీలు మూతపడటం ఖాయమంటున్నారు. ఒంగోలులో మూడు ప్రముఖ కాలేజీలుంటే రెండు కాలేజీలకు రూ.15 కోట్లు చొప్పున బకాయిలున్నాయి. మరో కాలేజీకి రూ.25 కోట్ల వరకూ ఉన్నట్లు అంచనా. ఇక్కడే సగం మంది విద్యార్థులు చదువుతున్నారు. ఫీజు ▶ 2లో

పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అన్సారియా, మంత్రి స్వామి

పూలే ఆశయ సాధనకు కృషి

మంత్రి స్వామి

▶ 8లో

అంబేద్కర్ విగ్రహం వెనకనే ఉన్న స్థలం

ఒక్క రికార్డూ సక్రమంగా లేదు..

- వీళ్లెలా పనిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు..
- సచివాలయ ఉద్యోగుల పనితీరుపై మంత్రి స్వామి అసంతృప్తి

రికార్డులు పరిశీలిస్తున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-కొండపి

'సచివాలయంలో ఉన్న రికార్డుల్లో ఏ ఒక్క రికార్డు కూడా సక్రమంగా లేదు.. దీనిని బట్టి వీళ్ళు ఏ విధంగా పనిచేస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు..' అని ఉద్యోగుల పనితీరు పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని పెట్లూరు సచివాలయాన్ని మంత్రి స్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులన్నీ పరిశీలించారు. గ్రామాలలో ఉన్న సమస్యలు పరిష్కరించటం కోసం ఏర్పాటుచేసిన సచివాలయంలో ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సచివాలయం సిబ్బందిని రేషనలైజేషన్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇకపై సచివాలయాల్లో రికార్డుల నిర్వహణపై అలసత్వంగా ఉన్న ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పెట్లూరులోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. అక్కడ ఉన్న గ్రామస్తులతో పాఠశాల ఉపాధ్యాయులు సక్రమంగా బడికి వస్తున్నారా.? లేదా.? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువల పరిశీలన

కొండపి మండలంలోని ముప్పవరం గ్రామంలో నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువల పని తీరును మంత్రి స్వామి పరిశీలించారు. ముప్పవరంలో ఉన్న వాటర్ ట్యాంక్ ▶ 2లో

ఊరి చివర ఉండాల్సినోళ్లు..

ఊరికి పైఎత్తున ఉంటే ఎలా.?

- దళితవాడ పక్కన జామాయిల్ వద్దన్నందుకు దళితులపై పెత్తందారు ఆగ్రహం
- రంగంలోకి దిగిన పోలీసులు
- అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి-శింగరాయకొండ

దశాబ్దాలు మారినా, ప్రభుత్వాలు మారుతున్నా దళితుల పట్ల వివక్ష మాత్రం కొనసాగుతూనే ఉంది. దళిత వాడ పక్కన జామాయిల్ వేస్తే తాగునీటికి సమస్య వచ్చిందని దళిత కాలనీవాసులు అడిగినందుకు వారిని కించపరిచేలా పెత్తందారు వ్యవహరించారు. 'ఊరి చివర ఉండాల్సిన వారు ఊరిపై ఎత్తున ఉంటున్నారు..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన శింగరాయకొండ మండలం ఊళ్ళ పాలెం గ్రామంలో చోటుచేసుకుంది.

ఊళ్లపాలెం గ్రామంలోని దళితవాడ పక్కనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వెనుక వైపున పురిని వెంకటేశ్వర్లురెడ్డికి చెందిన ఖాళీ స్థలం ఉంది. ఆ ఖాళీ స్థలం భూమిలో జామాయిల్ మొక్కలు వేసుకుంటున్న సమయంలో సంకూరి మర్లీదేవా, నూతలపాటి మహేష్, పసుమర్తి నాగరాజు, కసుకుర్తి నాగరాజు, తలకాల అశోక్, ఆరేటి కోటేశ్వరమ్మ కలిసి వెంకటేశ్వరరెడ్డి దగ్గరికి వెళ్లారు. తమ దళితవాడకు నీటి ఎద్దడి సమస్య ఉందని, దళితవాడ పక్కనే ఉన్న స్థలంలో జామాయిల్ మొక్కల వేయటం ద్వారా నీటికి ఇబ్బందులు పడతామని చెప్పారు. వెంకటేశ్వరరెడ్డి వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ▶ 2లో

రూ.130 కోట్లకు పైనే.!

(మొదటిపేజీ తరువాయి)

రీయింబర్సుమెంటుపై మాజీ సిఎం జగన్ కూడా తాజాగా స్పందించారు. విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు ఎస్ఎఫ్ఐతో పాటు విద్యార్థిసంఘాలూ ఫీజులు విడుదల చేయాలని కోరుతున్నాయి. కూటమి నేతలూ పీజురీయింబర్సుమెంటుపై మాట్లాడుతున్నారే తప్ప నిధులు విడుదలకు చర్యలు తీసుకోవడం లేదు. ఇక ఇంజనీరింగ్ కాలేజీల అసోసియేషన్ ప్రతినిధులు భేటీ అయ్యారు. బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వ కీలక నేతలతో సంప్రదింపుల్లో ఉన్నారు. కొంత ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కాలేజీల యజమానులు కూడా ఇప్పుడు ప్రభుత్వంపై గట్టిగా ఒత్తిడి చేసే పరిస్థితిలో కనిపించడం లేదు. గట్టిగా అడిగితే ఎక్కడ బకాయిలు ఆపేస్తారోనన్న ఆందోళన కూడా లేకపోలేదు. అందుకే బతిమిలాడుకునే మార్గంలోనే పోతున్నారు.

విద్యార్థుల ప్రగతిపై అధికారులు దృష్టి సారించాలి

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రధానంగా విద్యార్థుల ప్రగతిపై అధికారులు దష్టి సారించాలన్నారు. 912 మంది విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిసెంబర్ 7వ తేదీన హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తినింపడానికి ఉన్నత స్థాయికి ఎదిగిన ఈ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. విద్యార్థులే ఆహ్వాన పత్రికలు సిద్ధం చేసేలా చూడాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో వసతి పొందుతూ ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రతి తరగతి గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే కార్యక్రమంలో వేదికను సిద్ధం చేసుకోవాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. విద్యార్థుల తల్లులకు రంగవల్లుల పోటీలు, విద్యార్థుల తండ్రులకు టగ్గాఫ్ వార్ పోటీలను నిర్వహించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీస్ కవాతు మైదానంలో సిద్ధం చేసిన హెలిప్యాడ్, పాఠశాలకు చేరుకునే మార్గంపై చర్చించారు. తదుపరి పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలను కమిషనర్ దష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంట సమగ్ర శిక్ష అభియాన్ ఎస్‌పి డి శ్రీనివాసరావు, విద్యాశాఖ ఆర్ జె డి, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు, వివిధశాఖల జిల్లా అధికారులు,తదితరులు ఉన్నారు.

ఊరికి పైఎత్తున ఉంటే ఎలా.?

(మొదటపేజీ తరువాయి)

'ఊరి చివర ఉండవలసిన వాళ్లు ఊరి పైఎత్తున ఉంటూ మాట్లాడతారా.?' అంటూ వారిపై మండిపడ్డారు. 'నా పొలం నా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటా' అంటూ అసభ్య పదజాలాలతో దూషించారని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎస్ఐ బి.మహేంద్రకు ఫోన్ ద్వారా సమస్యను వివరించడంతో ఎస్ఐ మహేంద్ర ఘటనా స్థలానికి చేరుకొని రెండు గ్రూపులతో మాట్లాడారు. దళితులు బుధవారం రాత్రి శింగరాయకొండ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బి.మహేంద్ర ఊళ్లపాలెం దళితుల్ని అసభ్య పదజాలంతో దూషించిన పురిని వెంకటేశ్వరరెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ఒక్క రికార్డూ సక్రమంగా లేదు..

(మొదటిపేజీ తరువాయి)

నుంచి వచ్చి ఏటి వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలవను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ బత్తుల సులోచన తెలిపారు. ఒక్కొక్క వైపు 250 మీటర్లు చొప్పున రెండు వైపులా కలిపి సుమారు 500 మీటర్లు వేస్తున్నట్లు చెప్పారు. డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సుమారు 20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు మె తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలు తెలుసుకొని సత్వరమే పరిష్కరించే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.



నరసింహారెడ్డికి నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి

నరసింహారెడ్డి సేవలు మరువలేనివి: మంత్రి

ప్రజాశక్తి-మర్రిపూడి

మర్రిపూడి మండలం అంకెపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పాలుగుండ్ల వెంకట నరసింహారెడ్డి తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలు మరువ రానివి అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. గురువారం అంకెపల్లిలో జరిగిన నరసింహారెడ్డి సంస్మరణ సభలో మంత్రి పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. నరసింహా రెడ్డి కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి మీ కుటుంబానికి తాను అండగా ఉంటానని మంత్రి స్వామి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చేరెడ్డి నర్సారెడ్డి, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొంటు హనుమారెడ్డి, శాంతి ఆంధ్రపత్రిక ఎడిటర్ గురిజాల బాబురావు, టిడిపి సీనియర్ నాయ కులు చేరెడ్డి పెద్ద నరసారెడ్డి, యోగి రెడ్డి, రమణారెడ్డి, చిలకల కొండారెడ్డి, బొమ్మినేని శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

ప్రజాశక్తి-తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరంలో వ్యవసాయశాఖ అధికారి బి ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎరువుల దుకాణా లను గురువారం తనిఖీ చేశారు. వివిధ రకాల ఎరువుల బస్తాలు నిర్దేశిత పరిమాణంలో ఉన్నాయా లేవా అని పరిశీలించారు.

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం: 203/2022

మల్లవరపు వెంకట రమణ .....వాది

వర్సెస్

సన్నెపోగు విజయ్‌కుమార్ ...... ప్రతివాది

టు,
సన్నెపోగు విజయ్‌కుమార్, పాస్టర్
తండ్రి: బెంజిమెన్, ఇశ్రాయేలు పేట,
యర్రగొండపాలెం పోస్టు మరియు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలో కోర్టు వారు దావా సమనులు ప్రతివాదికి పంపిననూ ప్రతివాది ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారు ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు ప్రకటన ద్వారా దావా సమనులు పంపడమైనది. పైన తెలిపిన ప్రతివాదికి వాయిదా 30-12-2024న ఉన్నది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు మీరు గానీ, మీ తరపు వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఉన్న ఆక్షేపణలు తెలియజేయగలరు. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

నామా సుబ్బారావు
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం: 511/2022

టంగుటూరి శ్రీనివాసరావు ....వాది

వర్సెస్

పెరుమాళ్ల యోగి సుబ్బరత్నం,
చనిపోయినందున వారి వారసులు .... ప్రతివాదులు
1. పెరుమాళ్ల సుబ్బరత్నాలు మరియు 5 మంది
1. పెరుమాళ్ల శారద, భర్త: గొంట్లా ప్రసాద్
(డిఫెండెంట్ నెం: 3)
తండ్రి: లేట్ పెరుమాళ్ల యోగి సుబ్బరత్నం,
గాంధీ బజారు, మార్కాపురం, ప్రకాశం జిల్లా.
2. పెరుమాళ్ల పద్మావతి, భర్త: మారుతి
తండ్రి: లేట్ పెరుమాళ్ల యోగి సుబ్బరత్నం
గాంధి బజారు, మార్కాపురం, ప్రకాశం జిల్లా
(డిఫెండెంట్ నెం: 4)
3. పెరుమాళ్ల శ్రీదేవి, భర్త: పేరం కిరణ్
తండ్రి: పెరుమాళ్ల యోగి సుబ్బరత్నం
గాంధీ బజారు, మార్కాపురం, ప్రకాశం జిల్లా
(డిఫెండెంట్ నెం: 5)
4. పెరుమాళ్ల అరుణ, భర్త: కునిశెట్టి పవన్‌కుమార్
తండ్రి: లేట్ పెరుమాళ్ల యోగి సుబ్బరత్నం
గాంధీ బజారు, మార్కాపురం, ప్రకాశం జిల్లా
(డిఫెండెంట్ నెం: 6)

పై నెంబరు దావాలో కోర్టు వారు దావా సమనులు ప్రతివాదులకు పంపినప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు ప్రకటన ద్వారా దావా సమనులు పంపడమైనది. పైన తెలిపిన ప్రతి వాదులకు వాయిదా 02-12-2024 తేదీన ఉన్నది. ఆరోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా లేదా మీ తరపు వకీలు ద్వారా హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు కేసు విచారించి తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
నామా సుబ్బారావు
అడ్వకేట్, మార్కాపురం.

డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ రెడ్రసల్ ఫోరం ఒంగోలు
CC No : 4/2024

గోపు పద్మజ ...కంప్లైనెంట్

మరియు

ఎన్.వి.సత్యనారాయణ మరియు ఇతరులు
...రెస్పాండెంట్లు

నోటీసు

To
R2) శ్రీ బాలాజీ ప్రమోటర్స్ ప్రొపరెటర్
కొత్త రమాదేవి
R3) కొత్త రమాదేవి భర్త శ్రీరామ్‌మూర్తి
పై ఇద్దరి చిరునామా గాంధీ నగర్, చీరాల.

పైనెంబర్ కేసులో శ్రీయుతులు కన్స్యూమర్ ఫోరం వారు మీకు నోటీసులు పంపించిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ నోటీసు నిమిత్తమై ఫోరం వారు తేదీ 05-12-2024కి వాయిదా వేసి యున్నారు ఆ రోజున ఉదయం 10:30 కి సదరు ఫోరంలో మీరు హాజరు కావలసియున్నది. లేనిచో మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని తెలియజేయడమైనది

ఒంగోలు
తేది : 28-11-2024

ఇట్లు
Y.సాయిబాబు
కంప్లైనెంట్ తరపు న్యాయవాది
ఒంగోలు

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెంబర్ 343/2023

కారంశెట్టి వెంకట గురు మధుసూదన రావు ..వాది

వర్సెస్

మాకినేని అమర సింహం ...ప్రతివాది

To,
మాకినేని అమర సింహం
తండ్రి వెంకట నరసింహం,
పెట్రోల్ బంకు దగ్గర, చిన్న బస్టాండు,
ఒంగోలు రోడ్డు, పొదిలి, ప్రకాశం జిల్లా.

దావా సమను

పై నెంబర్ వాది దావా ప్రాంసరీ నోట్ల పరిహారం రాబట్టే నిమిత్తం డిక్రీ కోరి నీ మీద దావాను పై వారి కోర్టులో దాఖలు చేయగా ప్రతివాది అయిన మీకు దావాసమను జారీనిమిత్తము తేది: 19-12-2024 నకు వాయిదా కలదు. సదరు తేదీన మీరు ఉదయం గం.10:30 ని.లకు పై వారి కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపవలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడిన ఇందు మూలముగా తెలుసు కొనవలయును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ : 19-12-2024 ఇట్లు
తాటికొండ రామ మోహన్‌రావు,
వాది తరపు అడ్వకేట్,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్:9885636729.

ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, మహింద్రా కంపెనీ ఎన్‌ఓసి సర్టిఫికెట్లు పోయినవి

... పెద్దారవీడు మండలంలోని చాట్లమడ గ్రామానికి చెందిన యామా వెంకటలక్ష్మమ్మకు చెందిన ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తో పాటు మహింద్రా కంపెనీ ఇచ్చిన ఎన్.ఓ.సి.సర్టిఫికెట్ 25-11-2024న పోయినవి. చాట్లమడ గ్రామంలో ఇంటివద్ద ట్రాక్టర్ లోని బాక్స్‌లో పత్రాలు ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. ఎవరికైనా దొరికిన యెడల తమకు అందజేయగలరు.

ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ నెం : **ఎ.పి.27 సి.ఎ.1920.**
ఇంజన్ నెం : **43024/ఎస్.జడ్.ఎ.00513.**
ఛాయిస్ నెం : **డబ్ల్యు.జడ్.సి.443606189515.**

ఇట్లు
యామా వెంకటలక్ష్మమ్మ
చాట్లమడ గ్రామం, పెద్దారవీడు మండలం.
సెల్ : 9441056299.

టెండర్ ప్రకటన

ప్రకాశం జిల్లా .నాగులుప్పలపాడు మండలం నాగులుప్పలపాడు (ఓబన్నపాలెం) గ్రామము లో యున్న శ్రీ నరసింహమూర్తి చెరువునకు సంబంధించి ఈ క్రింద తెలిపిన పనులకు గాను 5వ తరగతి రిజిస్టర్డ్ సివిల్ కాంట్రాక్టర్ల నుండి సీల్డు వేసిన టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనులకు గాను తేది: 29-11-2024 ఉదయము :10.00 గంటల నుండి తేది: 11 -12-2024 సాయంత్రము 5.00 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించబడును. టెండర్ షెడ్యూలుతేది: 12 -12-2024 ఉదయము 10.00 గంటల నుండి తేది: 12 -12 -2024 సాయంత్రము 5.00 గంటల వరకు ఇవ్వబడును. టెండర్ దరఖాస్తుతో పాటు టెండర్ ధరావత్తును డిమాండ్ డ్రాఫ్ట్ తో గాని, నగదు చెల్లించిన రశీదు గాని జతపరచవలెను. సీల్డు కవర్లు తేది: 13-12-2024 ఉదయము 10.00 వరకు పై దేవస్థానము / సంస్థ ఆపీసు నందు స్వీకరించబడి అదే రోజు సాయంత్రం 4.00 గంటలకు శ్రీయుత జిల్లా దేవదాయశాఖ అధికారి, దేవదాయ ధర్మదాయ శాఖ, ఒంగోలు వారి కార్యాలయము నందు వారిచేగాని వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు తెరువబడును.

వ.నెం.	పనిపేరు	అంచనా విలువ	టెండర్ ధరావత్తు	టెండర్ షెడ్యూల్ ఖరీదు	పనిపూర్తి చేయుకాలము
1	దక్షిణం వైపు ఇన్‌లెట్ వాల్ నిర్మాణం	Rs.4.20,000/-	Rs.4.200/-	Rs.1000/-	4నెలలు

గమనిక : ఏ కారణము చేతనైనా కారణము తెలుపకుండా టెండర్లు తిరస్కరించు అధికారము కార్యనిర్వహణాధికారి వారికి కలదు.

ఇట్లు
కార్యనిర్వహణాధికారి
Phone No: 9490177991

టెండర్ ప్రకటన

ప్రకాశం జిల్లా,నాగులుప్పలపాడు మండలం. బి. నిడమానూరు గ్రామములో వేంచేసియున్న శ్రీ. చెన్నకేశవ మరియు ఆంజనేయ స్వామి దేవస్థానం సంబంధించి ఈ క్రింద తెలిపిన పనులకు గాను 5వ తరగతి రిజిస్టర్డ్ సివిల్ కాంట్రాక్టర్ల నుండి సీల్డు వేసిన టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనులకు గాను తేది: 29-11-2024 ఉదయము :10.00 గంటల నుండి తేది: 11 -12-2024 సాయంత్రము 5.00 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించబడును. టెండర్ షెడ్యూలుతేది: 12 -12-2024 ఉదయము 10.00 గంటల నుండి తేది: 12 -12 -2024 సాయంత్రము 5.00 గంటల వరకు ఇవ్వబడును. టెండర్ దరఖాస్తుతో పాటు టెండర్ ధరావత్తును డిమాండ్ డ్రాఫ్ట్ తో గాని, నగదు చెల్లించిన రశీదు గాని జతపరచవలెను. సీల్డు కవర్లు తేది: 13-12-2024 ఉదయము 10.00 వరకు పై దేవస్థానము / సంస్థ ఆపీసు నందు స్వీకరించబడి అదే రోజు సాయంత్రం 4.00 గంటలకు శ్రీయుత జిల్లా దేవదాయశాఖ అధికారి, దేవదాయ ధర్మదాయ శాఖ, ఒంగోలు వారి కార్యాలయము నందు వారిచేగాని వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు తెరువబడును.

వ.నెం.	పనిపేరు	అంచనా విలువ	టెండర్ ధరావత్తు	టెండర్ షెడ్యూల్ ఖరీదు	పనిపూర్తి చేయుకాలము
1	తూర్పు మరియు దక్షిణం ప్రహరీ వాల్ నిర్మాణం	Rs.4.50,000/-	Rs.4.500/-	Rs.1000/-	4నెలలు

గమనిక : ఏ కారణము చేతనైనా కారణము తెలుపకుండా టెండర్లు తిరస్కరించు అధికారము కార్యనిర్వహణాధికారి వారికి కలదు.

ఇట్లు
కార్యనిర్వహణాధికారి
Phone No: 9490177991

అత్యాశకు పోతే.. అసలుకే మోసం

సైబర్ వలకు చిక్కితే ఖాతాలు ఖాళీ

అమాయకుల్ని మోసం చేస్తున్న కేటుగాళ్లు

అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రజల అమాయకత్వం, అత్యాశను ఆసరాగా చేసుకుని అందినకాడికి దోచుకుంటున్నారు. సామన్య ప్రజలతో పాటు విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోవడం ఆందోళన కలిగిస్తోంది. అవగాహన లేకపోవడం, కష్టపడకుండా డబ్బు వచ్చి పడాలన్న ఆశతో మోసపోయిన బాధితులు చివరికి పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు.

➢ మార్కాపురం పట్టణానికి చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగి పేరిట ఫేస్ బుక్ నకిలీ ఖాతా తెరిచిన ఓ ఆగంతకుడు ఆయన స్నేహితులకు ఫ్రెండ్ రిక్వెస్టు పంపి తనకు అత్యవసరంగా నగదు సాయం చేయాలని కోరాడు. కొంత మంది నగదు పంపారు. మరి కొంతమంది ఆ వ్యక్తికి ఫోన్ చేసి ఏం కష్టం వచ్చింది? అందరినీ ఎందుకు డబ్బులు కావాలి అని అడుగుతున్నావని అడగడంతో ఆ విషయం తెలుసుకున్న ఉద్యోగి అవాక్కయ్యాడు.

➢ రాయవరం గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన ఓ యువకుడికి ఇటీవల ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. రూ.5 లక్షలు ముద్ర రుణం వస్తుందని నమ్మబలికాడు. ముందుగా రూ.4,500 బీమా కింద చెల్లించాలని చెప్పాడు. దీంతో ఆ వ్యక్తి చెప్పిన ఫోన్‌పే నంబర్‌కు సొమ్ము చెల్లించాడు. మరలా ఫోన్ చేసి మీరు తొలి ఈఎంఐ కింది రూ.11,514 చెల్లించాలని, అప్పుడే రుణం ఖాతాలో జమ అవుతుందని చెప్పాడు. నమ్మించడానికి రుణం మంజూరైనట్లు నకిలీ కాగితాలు పంపాడు. నగదు కోసం ఆ వ్యక్తి పదే పదే ఫోన్ చేస్తుండటంతో ఆ యువకుడికి అనుమానం వచ్చింది. వెంటనే మార్కాపురం పట్టణానికి చేరుకుని తన ఖాతా ఉన్న బ్యాంకు అధికారులను సంప్రదిస్తే ఆ పత్రాలు నకిలీవని తేల్చారు.

➢ పట్టణ చెందిన ఒక వ్యాపారి ఇటీవల ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. సైబర్ నేరగాళు ట్రూ కాలర్లో ఆరోగ్యశ్రీ పేరు వచ్చేలా అతని చరవాణికి ఫోన్ చేశారు. మేము ఆరోగ్యశ్రీ అధికారులమని చెప్పారు. శస్త్ర చికిత్సకు మంజూరైన సొమ్ములో కొంత మిగిలిందని, ఆ నగదు పంపాలంటే ముందుగా మీరు మేము సూచించిన ఖాతాకు రూ.12 వేలు జమ చేయాలని లింక్ పంపారు. ఆ నగదు జమ చేస్తే మిగిలిన డబ్బులు రిలీజ్ అవుతాయని నమ్మించేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. మీరు లైన్‌లోనే ఉండండి మా అబ్బాయి పోలీస్ అతనికి ఫోన్ ఇస్తాను అని సదరు వ్యక్తి అతనితో మాట్లాడండి అని చెప్తుండగానే కాల్ కట్ చేసి నెంబర్లు బ్లాక్ లిస్ట్‌లో పెట్టేశారు.

ఫిర్యాదు చేస్తే.. ఫలితం

ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు అనేకం జరిగాయి. కొద్దిమంది మాత్రమే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. నగదు కోల్పోయిన వెంటనే 155260 లేదా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. 24 గంటల్లోపు పోలీసులను ఆశ్రయిస్తే నగదు వెనక్కి వచ్చే అవకాశం ఉంది. 100కు డయల్ చేసినా ఫిర్యాదులు స్వీకరిస్తారు.

ఇ-కెవైసి పేరిట ఫోన్లు చేయరు

బ్యాంకు ఖాతాకు ఆధార్, పాన్, చరవాణి సంఖ్య అనుసంధానం, ఇ-కేవైసీ పేరిట బ్యాంకుల నుంచి ఎటువంటి ఫోన్లు చేయరు. ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా బ్యాంకులో మాత్రమే సంప్రదించాలి. దీనిపై ఇప్పటికే ఖాతాదారులకు ఎస్ఎంఎస్ ద్వారా, అవగాహన కార్యక్రమాలతో అప్రమత్తం చేస్తున్నాం.

- ఎన్.హరి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మెయిన్ బ్రాంచ్ మేనేజర్, మార్కాపురం

అప్రమత్తత అవసరం

సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. అలాంటి వాటిపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. ఆపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు, ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతా ఓటీపీ లాంటి వివరాలు అడిగితే చెప్పకూడదు. సామాజిక మాధ్యమాల్లో పరిచయం లేని వ్యక్తులతో సంభాషించడం, సెల్‌ఫోన్‌లో అనవసర లింకులు క్లిక్ చేయడం వంటివి చేయకూడదు.

- డాక్టర్ యు.నాగరాజు, డీఎస్పీ, మార్కాపురం

బోల్తా పడిన మోటార్ బైక్

మోటార్ బైక్ బోల్తా

ఒకరికి గాయాలు

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

ప్రమాదవశాత్తు మోటార్ బైక్ బోల్తా పడి ఒకరు గాయపడిన సంఘటన మండలంలోని శీలంవారిపల్లి సమీపంలో గురువారం జరిగింది. నల్లమడుగుల గ్రామానికి చెందిన షేక్ మౌళి సిఎస్ పురం నుంచి నల్లమడుగులకు వెళుతుండగా శీలంవారిపల్లి గ్రామం దాటిన తర్వాత చప్టా దగ్గర మోటార్ బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో మౌళికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడు సిఎస్ పురం ఆర్ఎంపి వైద్యుల వద్ద చికిత్స పొందారు. రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు ఏపుగా పెరిగిన కారణంగా ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నట్లు పరిసర ప్రాంత ప్రజలు తెలియజేస్తున్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సిఐ జయరావు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

నూతన మద్యం చట్టం ప్రకారం ఒక వ్యక్తి దగ్గర మూడు మద్యం సీసాలకు మించి ఉండరాదని అలా ఉన్నట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గిద్దలూరు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జయరావు తెలిపారు. ప్రభుత్వ లైసెన్స్ షాపు నిర్వాహకులు అక్రమంగా మద్యం అమ్మే వ్యక్తులకు, బెల్ట్ షాపుల నిర్వహణకు మద్యం సరఫరా చేయవద్దన్నారు. అధిక రేట్లకు మద్యం అమ్మరాదని, నిర్ణీత సమయంలో, ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్టు షాపుల నిర్వహణ, నాటు సారా తయారీ, సరఫరా, గంజాయి సరఫరాలపై తగు సమాచారం ఉంటే గిద్దలూరు ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. గిద్దలూరు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటికే 19 కేసులు నమోదయ్యాయని తెలిపారు. 18 మందిని అరెస్ట్ చేసి నలుగురిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. 14 మందిని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశామని, 12 మందిని మందిని మండల మెజిస్ట్రేట్ తహసీల్దార్‌కు బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు బాపట్ల కోర్టుకు వర్రా రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్, కడప ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రా రెడ్డిపై ప్రభుత్వ పెద్దలపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారని వచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు జిల్లా పెదనందిపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ప్రస్తుతం కడప జైలులో వున్న రవీంద్రా రెడ్డిని పీటీ వారంట్‌పై గురువారం కడప జైలు నుంచి పెదనందిపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు బాపట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వర్రా రవీందర్ రెడ్డిని పోలీసులు హాజరు పరచనున్నారు.

వర్రా రవీంద్రారెడ్డి గతంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, షర్మిల తదితరులపై పరువు నష్టం కలిగించే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మహిళలపై , రాజకీయ పార్టీల నేతలపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు ప్రముఖ వ్యక్తుల పరువు నష్టం వంటి దుష్ప్రయోజనాల ముప్పును అరికట్టాలని నిర్ణయించింది. వివిధ సామాజిక వేదికలపై అనుచిత విషయాలను పోస్ట్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తుంది. ఈ నేపథ్యంలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో వర్రా రవీంద్రారెడ్డిపై కేసులు నమోదయ్యాయి.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలంలోని చీర్వానుప్పలపాడు పంచాయతీ, టి.అగ్రహారం గ్రామానికి చెందిన జాగర్లమూడి అంజమ్మకు రూ.57,989, జాగర్లమూడి లింగమ్మకు రూ.55,178, మరెళ్ల చిరంజీవికి రూ.41,218 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్ కుమార్ గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్ కుమార్, జాగర్లమూడి హరిబాబు, గ్రామ సర్పంచి చిన్నమ్మ, మురళీ, ఆళ్ళ నాగార్జున పొద మురళీ, పొద శ్రీధర్, పోలవరపు శ్రీకాంత్, వేణు, వినోద్, సత్యానందం, పరిటాల రఘు, మెట్టు సుబ్బయ్య, కొణిజేటి ధనుష్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం నిర్మాణానికి కృషి

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల కేంద్రమైన మద్దిపాడులోని కళాకేంద్రం ప్రక్కన ఉన్న గ్రంథాలయ భవనాన్ని పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తెలిపారు. గురువారం అసంపూర్తిగా నిర్మించి ఉన్న గ్రంథాలయం భవనాన్ని పరిశీలించారు. వివిధ సంఘాల విశ్రాంత ఉద్యోగులు గ్రంథాలయం అసంపూర్తిగా ఉన్న భవనం విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లి త్వరలో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు.

ఇంటింటికీ కుళాయి పనుల్లో..

నాయకుల కక్కుర్తి

- రూ.5 లక్షల నిధులు స్వాహా - పనులు చేయకుండానే నగదు డ్రా - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

ఇంటింటికీ కుళాయి పేరుతో నాయకులు మోసం చేశారు. ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి నీరు అందించాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం త్రిపురాంతకం మండలంలోని ఎండూరివారిపాలెంనకు రూ.5 లక్షలు మంజూరు చేసింది. దీనిలో భాగంగా డీప్ బోర్లు ఏర్పాటు చేసి పైపులైన్లు అమర్చి ప్రతి ఇంటికీ కుళాయిలు బిగించాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వంలో ఈ పనులు చేపట్టిన నాయకులు గతంలో ఉన్న డీప్ బోర్లనే చూపించి, నేలపైనే కొన్ని పైపులు వేసి కుళాయిలు అమర్చకుండానే పనులు మొత్తం జరిగినట్లు చూపించి ఎం.బుక్‌లు తయారు చేయించుకున్నారు. మంజూరైన రూ.5 లక్షల నిధులను స్వాహా చేశారు. అధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం భూమిపై పరిచిన పైపులు సైతం తొలగించారు. కొందరు ఏకంగా నీళ్లు రాని పైపులు తమ ఇంటి ముందు ఎందుకంటూ పక్కన పడేశారు. కాగా ఆ పైపులలో సైతం కొన్నింటిని పోగు చేసుకొని ఆ గ్రామానికి చెందిన గత ప్రభుత్వ నేత అమ్ముకొని సొమ్ము చేసుకున్నట్లు కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు లోతైన విచారణ జరిపి పనులు పూర్తి చేయకుండానే నిధులు మింగిన వైసీపీ నేతపై చర్యలు తీసుకోవడంతో పాటు అందుకు బాధులైన అధికారులపై కూడా వేటు వేసి తమ కాలనీలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఎండూరివారిపాలెం గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా తనకు సంబంధం లేదని ఆ పనులు పంచాయతీ వారికి అప్పజెప్పామని తెలిపారు. ఈ పనులు తమ సమయంలో జరిగినవి కావని, జరిగిన తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

పక్కన పడేసిన పైపులు

పంటల నమోదు ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి-బేస్తవారిపేట

మండలంలోని చిట్టిచర్ల రైతు భరోసా కేంద్రం పరిధిలో పంటల నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి జక్కం మెర్సీ గురువారం పరిశీలించారు. రైతుల పంట పొలంలో పంట నమోదు కార్యక్రమం జరుగుతుండగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ పంటలను కచ్చితంగా వ్యవసాయ గ్రామ సహాయకుడి ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. సున్నా వడ్డీకే పంట రుణాలు, ఇన్సూరెన్స్ చేసుకోవడం వల్ల వైపరీత్యాల సంభవించినప్పుడు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా పండించిన పంటను ప్రభుత్వానికి అమ్ముకునేందుకు వీలుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఆదిగణేష్, గ్రామ ఉద్యానవన సహాయకురాలు జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

అవినీతి అదానీని అరెస్టు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - బాపట్ల

అదాని దేశంలోనే గాక విదేశాల్లో అనేక ఒప్పందాలు కుదుర్చుకుని వాటికి సంబంధించి అదాని అవినీతిని అమెరికా బట్టబయలు చేసి అతని నిజ స్వరూపాన్ని బయటపెట్టిందని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. గంగయ్య మాట్లాడుతూ తాజాగా ఉమ్మడి విశాఖపట్నం నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ పవర్ ప్రాజెక్టులో అదాని అడుగుపెట్టి ప్రజా ప్రతినిధులను అడ్డుపెట్టుకొని పాత కాంట్రాక్టర్లు అందరిని రద్దు చేసి రూ.వందల కోట్ల కాంట్రాక్టులను చేజిక్కించుకోవడానికి చూస్తున్నారని అన్నారు. దీనికి అధికారపక్ష కూటమికి చెందిన ప్రజా

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

ప్రతినిధి సహకారం అందిస్తున్నారని ఆరోపించారు. అదానీ బొగ్గు కాంట్రాక్ట్ అమల్లోకి వస్తే విశాఖ పోర్టుపై ప్రభావం చూపుతోందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తే రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడతారని అన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు కాంట్రాక్టర్‌ను కూడా ప్రైవేటు పరం చేశారని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతిని ఇప్పటి అధికార ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. విశ్రాంత ఆచార్యులు కారుమంచి విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలను, ప్రజాప్రతినిధులను లోబర్చుకొని దేశ, విదేశాల్లో అనేక ఆర్థిక లూటీలకు అదాని పాల్పడుతున్నారని అన్నారు. అదానితో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు రద్దు చేయాలని అన్నారు. ఎయిర్ పోర్టులను, గంగవరం పోర్టును ఈపాటికే అదానికి కట్టబెట్టారని అన్నారు. బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జి రాజారావు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో జరిగిన దోపిడీలను మించి గత ప్రభుత్వం దోపిడీకి పాల్పడిందని అన్నారు. సమావేశంలో కె నాగేశ్వరరావు, పి కొండయ్య, ఎన్ బాబురావు, టి కృష్ణమోహన్, కె శరత్, టి సుభాషిణి పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా ప్రథమ మహాసభలకు తరలిరావాలి

జిల్లా నాయకులు సిహెచ్ మణిలాల్

ప్రజాశక్తి - రేపల్లె

బాపట్ల పట్టణంలో నవంబర్ 30న జరిగే సిపిఎం బహిరంగ సభకు కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ కోరారు. ముందుగా బహిరంగ సభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. నవంబర్ 30, డిసెంబర్ 1 తేదీల్లో సిపిఎం జిల్లా ప్రథమ మహాసభలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 30న సాయంత్రం 3గంటలకు బాపట్ల పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి ప్రదర్శన, ఆనంతరం రథం బజార్లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి రమాదేవి, సిహెచ్ బాబురావు, సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య హాజరవుతారని తెలిపారు. బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత 2022 నుండి ఇప్పటి వరకు జిల్లాలో అనేక ప్రజా సమస్యలపై సిపిఎం నిర్వహించిన ప్రజా ఉద్యమాలు సమీక్షించుకుని భవిష్యత్తు పోరాటాలను ఈ సభలో రూపొందిస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలవల్ల ప్రజలపై వేస్తున్న భారాలను ఎదుర్కోవ టానికి ఈ మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా నూతన నాయకత్వాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. మహాసభల సందర్భంగా జరిగే ప్రదర్శన, బహిరంగ సభకు రేపల్లె ప్రాంతంలో సిపిఎం సభ్యులు, సానుభూతి పరులు, జిల్లా వ్యాప్తంగా, వామపక్ష అభిమానులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు కె ఆశీర్వాదం, సిహెచ్ ఆగస్టీన్ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు మణిలాల్

కోటిరెడ్డి స్మారక స్థూపం వద్ద సిపిఎం పతాక ఆవిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల

సిపిఎం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభల సందర్భంగా మండలంలోని కుక్కలవారిపాలెంలో గంపాల వెంకటేశ్వర్లు, గంపాల కోటిరెడ్డి స్మారక స్తూపం వద్ద సిపిఎం పతాకాన్ని సిపిఎం నాయకులు కె నాగేశ్వరావు గురువారం ఆవిష్కరించారు. అమరవీరుల త్యాగాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతామని అన్నారు. మహాసభలు జయప్రదం కావాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వై భాస్కరరావు, పి కొండయ్య, శరత్, దినేష్, గంపల వెంకటేశ్వర్లు కుమార్తె శకుంతల, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్థూపం వద్ద పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

'తెలుగుదేశం' సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - పర్చూరు

తెలుగుదేశం సభ్యత్వం కార్యకర్తలకు భరోసా అని, ప్రతి కార్యకర్త సభ్యత్వం నమోదు చేయించుకోవాలని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. తెలుగుదేశం కార్యకర్తలకు సభ్యత్వం కొండంత భరోసాగా నిలుస్తుందని అన్నారు. తెలుగుదేశం పార్టీతోనే కార్యకర్తల సంక్షేమం సాధ్యమన్నారు. 2024-26 సభ్యత్వ నమోదును డిసెంబర్ 2 లోపు పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరితో సభ్యత్వాన్ని తీసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. అవగాహన కల్పించి అత్యధికంగా సభ్యత్వ నమోదు చేపట్టాలని అన్నారు. రూ.100తో రూ.5లక్షల ప్రమాద బీమా ఉంటుందని అన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి మట్టి ఖర్చులు నిమిత్తం వెంటనే రూ.10వేల సాయం అందించనున్నట్లు తెలిపారు. తెలుగువాళ్లకు ఎన్టీఆర్ ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చారని అన్నారు. తెలుగుజాతి ఔన్నత్యం కోసం చంద్రబాబు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం పనిచేసే ఏకైక పార్టీ తెలుగుదేశం అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలుగుదేశం పార్టీలోనే కార్యకర్తల సంక్షేమ నిధి ఉండడం గర్వకారణం అన్నారు. కార్యకర్తల సంరక్షణ కోసం తెలుగు దేశం నిరంతరం వెన్నంటి ఉంటుందని అన్నారు. ప్రతిపక్షంలో సైతం కార్యకర్తలకు అనుక్షణం యువనేత లోకేష్ అండగా నిలిచారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు స్వయంగా సభ్యత్వాన్ని తీసుకోవాలని అన్నారు. క్రియాశీల సభ్యత్వం కూడా తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు జరిగిందని అన్నారు.

శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు

క్రీడాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

అంతర్జాతీయ క్రీడాకారులకు ఎంఎల్ఏ సత్కారం

ప్రజాశక్తి - చీరాల

ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో బంగారు పతకాలు సాధించిన టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కూలి పని చేస్తూ జీవనం సాగించే సాంబశివరావును ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సత్కరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో విజేతలు ఇద్దరిని ఆయన అభినందించారు. శాలువా కప్పి సన్మానించారు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ పోటీల్లో షాట్ పుట్‌లో బంగారు పతకం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన సాంబశివరావు విజయం సాధించటం చీరాల ప్రాంతానికి గర్వకారణమని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు అంతర్జాతీయ స్థాయిలో సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను పాల్గొన్నారు.

సిఎం సహాయనికి అందజేస్తున్న ఆనందబాబు

సీఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి - వేమూరు

అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయ నిధి నుండి మంజూరైన నగదును శాసన సభ్యులు నక్క ఆనందబాబు గురువారం అందజేశారు. మండలంలోని కుచెల్లపాడు గ్రామానికి చెందిన పెనుమూడి ఇంద్రావతి రూ.80వేలు, అదే గ్రామానికి చెందిన వెల్లబాటి రాజేష్‌కు రు.26218, జంపని గ్రామానికి చెందిన పెరుగు వరమల్లేశ్వరికి రు.37378ను చెక్కు రూపంలో అందించారు. వీరంతా అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నారు. చికిత్స కోసమైన బిల్‌ను శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు సిఎంఆర్‌ఎఫ్ కార్యాలయానికి సిఫార్సు చేయడంతో నిధులు మంజురు చేశారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బధిర విద్యార్థులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - అద్దంకి

న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆధ్వర్యంలో సింగరకొండ రోడ్డులోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో గురువారం ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో విద్యార్థులకు వినికిడి సమస్యలపై డాక్టర్ బి రాజేష్, కంటి సమస్యలకు డాక్టర్ జి షాలేమ్ రాజు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వారి సమస్యలు గుర్తించి తగు సూచనలు అందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మహమ్మద్ రఫీ, తాళ్లూరి మార్తాశ్రీను, ప్రకాష్, పాఠశాల నిర్వాహకులు పూనూరు ఆరోగ్యం, ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, ప్రేమ్ ఐ కేర్ క్లినిక్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాసా కిట్లు అందజేస్తున్న ఎంఈఓ

నాసాకు చైతన్య విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

విద్యార్థులు పుస్తకాల ద్వారా మాత్రమే విషయ పరిజ్ఞానాన్ని పొందడం కాకుండా వివిధ రకాల ప్రాజెక్టులు చేయడం ద్వారా వారిలో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీయడానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఇఒ ఎంసిహెచ్ వస్రాం నాయక్ అన్నారు. స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు 27మంది అమెరికాకు చెందిన నేషనల్ స్పేస్ సొసైటీ నాసా రీసెర్చ్ సెంటర్లు సంయుక్తంగా నిర్వహించే నాసా స్పేస్ సెటిల్ మెంట్ 2024 -25 కాంటెస్ట్ నందు ప్రాజెక్ట్ డిజైన్ చేయుటకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కాసాని సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాసా కిట్లను విద్యార్థులకు ఎంఈఓ అందజేశారు. చిన్నతనం నుండే సైన్స్ పట్ల ఆసక్తి కలిగి ఉంటే దేశం గర్వించ దగ్గ శాస్త్రవేత్తలు అవుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎఒ ఇ శేషగిరిరావు, డీన్ జి రాఘవులు, జి రాజ్యలక్ష్మి, బి గీత, ఎస్ సునీత పాల్గొన్నారుద

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు 2గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఎఇ గోరంట్ల అనిల్ కుమార్ తెలిపారు. సబ్ స్టేషన్ విస్తరణ పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ ప్రభాకరరావు

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని విజ్ఞాన్ జూనియర్, డిగ్రీ కళాశాలలో గురువారం యర్రగొండపాలెం సిఐ సిహెచ్ ప్రభాకరరావు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాలు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సంబంధించిన వివరాల పట్ల అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, స్వీయ రక్షణ, బాల్య వివాహాలు, తెలియని వయసులో ప్రేమ, ఆకర్షణ, సోషల్‌మీడియాలో పరిచయాలు, ఆన్‌లైన్ వేధింపులు, ప్రేమ పేరుతో వలవేసి చేసే ఆర్థిక, శారీరక, మానసికంగా ఇబ్బందులు, మహిళలపై జరుగుతున్న నేరాలు, ఈవ్ టీజింగ్, మరియు చట్టాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, అవగాహనతోనే సైబర్ నేరాల బారిన పడకుండా ఉండగలమని చెప్పారు. సైబర్ నేరాలపై రిపోర్ట్ కోసం సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 సంప్రదించాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే హెల్ప్ లైన్ నెంబర్ 1930కి, సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థులంతా నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఇంకా ఎస్సై పి చౌడయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ సూరె వెంకట రమేష్, ప్రిన్సిపాల్ బాల వీరయ్య, అధ్యాపకులు మార్కు, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగమహేశ్వరి

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సును పెద్దదోర్నాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి నాగమహేశ్వరి మాట్లాడారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సావిత్రి, అధ్యాపకులు డాక్టర్ కె విజయబాబు, ఎన్ జయసింహ, జీ రమేష్, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోని షిర్డీ సాయిబాబా మందిరంలో ప్రతి నెలా పేదలకు సేవా కారక్రమాలు కొనసాగుతుంటాయి. అందులో భాగంగా పట్టణంలోని 100 మంది పేదలను గుర్తించారు. చలికాలంలో ఇబ్బంది పడకూడదని దుప్పట్లను గురువారం పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

గ్రావెల్ తవ్వకాలపై మెరుపు దాడులు

- 12 టిప్పర్లు, ఒక జెసిబి స్వాధీనం - రూరల్ సిఐ శ్రీకాంత్ వెల్లడి

ప్రజాశక్తి-మద్దిపాడు

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న విషయం తెలియడంతో ఒంగోలు రూరల్ సిఐ శ్రీకాంత్‌బాబు బుధవారం అర్ధరాత్రి సిబ్బందితో కలిసి మెరుపు దాడులు చేశారు. 12 టిప్పర్లను, ఒక జెసిబిని స్వాధీనం చేసుకున్నారు. దాడులకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు గురువారం వెల్లడించారు. మండల పరిధిలోని బూరేపల్లి కొండ వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న సిఐ తన సిబ్బందితో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అక్కడికి వెళ్లారు. మద్దిపాడు ఫ్లైఓవర్ దిగువన సీతారాంపురం వెళ్లే రోడ్డు వద్ద గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. బూరేపల్లి కొండ వద్ద జెసిబిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 12 టిప్పర్లు, ఒక జెసిబిని సీజ్ చేసినట్లు సిఐ వెల్లడించారు. అనంతరం వీటిని మైనింగ్ శాఖకు అప్పగించామన్నారు. ఈ తనిఖీలలో సంతనూతలపాడు ఎస్సై అజయ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-మార్కాపురం

ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి చొరవతో 100 కంపెనీలతో మార్కాపురంలోని కాలేజి రోడ్డులో గల సౌజన్య ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించగా ఎంపీ మాగుంట తనయుడు రాఘవరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. డివిజన్‌లో నలుదిక్కుల నుంచీ నిరుద్యోగులు పాల్గొన్నారు. అనంతరం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టారన్నారు. పారిశ్రామికవేత్తలు మన రాష్ట్రం వైపు చూస్తున్నారన్నారు. పెద్ద పెద్ద కంపెనీలు ఎన్నో రాబోతున్నాయన్నారు. ఉన్నత చదువుల్లో రాణించే వారిలో

జాబ్ మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల

ఎక్కువ శాతం మందికి ఉపాధి లభిస్తుందన్నారు. మార్కాపురం ప్రాంతంలో నిరుద్యోగులకు కొందరికైనా ఉపాధి లభించేలా ఈ మేళా నిర్వహించినట్లు చెప్పుకొచ్చారు. జాబ్ మేళా ముగిసిన అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారు ఆయా కంపెనీల ప్రతినిధుల నుండి నియామక పత్రాలు అందుకున్నారు.

నీటి ప్రయాణ పర్యాటకంపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో ఓడ/నీటి ప్రయాణ పర్యాటకాన్ని అభివృద్ధి పరచటానికి అనువైన మార్గాల గుర్తింపు, చేపట్టిన చర్యలపై ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సమాదానమిస్తూ పర్యాటక ప్రదేశాలు, ఉత్పత్తులు, ఓడ ప్రయాణం అభివద్ధి పరచి ఉన్నత స్థానానికి తీసుకపోవడం రాష్ట్రాల ప్రధాన భాద్యతని, దేశాన్ని సంపూర్ణ పర్యాటక గమ్యానికి తీసుకొచ్చేందుకు కేంద్ర నిధులతో అన్ని ప్రధాన ఓడరేవులు ప్రతినిధులు, మాధ్యమాల సహకారంతో పర్యాటక నౌకాయాన మంత్రిత్వ శాఖలు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. ఇందులో కార్యాలయాల ఏర్పాటు, చార్జీలు తొలగింపు- తగ్గింపు, విదేశీ వస్తువులపై రవాణా చార్జీలు తొలగింపు, జిఎస్‌టి . పన్ను తగ్గింపు, విసా సౌకర్యాలు పొడిగింపు అన్ని సంస్థలకు- పనులకు ఒకే రకమైన సేవలు ఏర్పాటు ముఖ్యమైనవని తెలిపారు. పర్యాటకం అభివద్ధికి పర్యాటక మంత్రిత్వ శాఖ అన్ని విభాగాలలో శిక్షణా తరగతులు నిర్వహిస్తుందన్నారు. విదేశీయులు, సంస్థలు దేశంలో నిర్వహించే ఓడ కార్యకలాపాలపై తగిన పన్ను విధింపు, ఆదాయ పన్ను మినహాయింపుకు 2024-25 కేంద్ర బడ్జెటులో అనుమతించిందన్నారు. ఈ చర్యలతో దేశంలో ఓడ /నీటి ప్రయాణ పర్యాటకం బాగానే అభివద్ధి చెందుతుందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

మాగుంట పర్యటన

ఎంపీ మాగుంట ఈ నెల 30, డిసెంబర్ 1వ తేదీ పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈనెల 30వ తేదీ ఉదయం 8 గంటలకు ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 11 గంటలకు ఒంగోలు ప్రకాశం భవనం వద్ద నున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో జరిగే దిశా కమిటీ సమావేశంలో పాల్గొంటారు. డిసెంబర్ 1వ తేదీ ఉదయం 8 గంటలకు ఒంగోలులో వివిధ ప్రాంతాలలో, పివిఆర్ మునిసిపల్ బాలుర వున్నత పాఠశాలలో మాగుంట అభిమానులు నిర్వహించు మాజీ ఒంగోలు పార్లమెంట్ సభ్యులు, స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి 29 వ వర్ధంతి కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉదయం 9.30 గంటలకు కలెక్టర్ కార్యాలయం నుంచి జరిగే ఎయిడ్స్ ర్యాలీలో పాల్గొంటారు.

సిఎం సహాయనిధికి రూ.లక్ష చెక్కు అందజేత

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని ఎస్‌సివికె నిలయం (రీడింగ్ రూమ్) ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.లక్ష విలువ కలిగిన చెక్కును మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి గురువారం అందజేశారు. వరద బాధితుల సహాయార్థం ఈ చెక్కును ఇచ్చారు. చెక్కు అందజేసిన వారిలో రీడింగ్ రూమ్ కమిటీ ఉపాధ్యక్షులు శాసనాల వీరబ్రహ్మం, కమిటీ సభ్యులు పఠాన్ హుస్సేన్ ఖాన్, ఆర్‌కెజె నరసింహం, టిడిపి నాయకులు కనిగిరి బాల వెంకటరమణ, మాలపాటి వెంకటరెడ్డి, ఇనుపకోళ్ల నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న కొల్లా శైలజ

అంధ కళాకారులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అంధ కళాకారుల కోసం శ్రీ గాయత్రి గ్రామర్ స్కూల్ విద్యార్థులు సేకరించిన రూ.23 వేలను స్కూల్ డైరెక్టర్ కొల్లా శైలజ గురువారం వారికి అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

30న పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వచ్చే నెల ఒకటో తేదీన ఆదివారం వస్తున్న నేపథ్యంలో సామాజిక పింఛన్లు ఒక రోజు ముందుగా ఈ నెల 30న పంపిణీ చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ తీసుకోని లబ్ధిదారులకు వచ్చే నెల రెండో తేదీ అందజేస్తామని పేర్కొన్నారు.

పూలేకి ఘన నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మహాత్మా జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బివి సుబ్బారెడ్డి, కంచర్ల సత్యనారాయణ గౌడ్, బోడా చెన్న వీరయ్య, నలగాటి మల్లయ్య, ఒంగోలు ఆదిరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో..

యర్రగొండపాలెం పట్టణంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా వైసిపి నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సంధర్భంగా జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్ మాట్లాడుతూ పూలే సేవలు చిరస్మరణీయమని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ రామావత్ అరుణాబాయి, మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, హరిబాబు నాయక్, సుబ్బారావు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో..

ఒంగోలు కలెక్టరేట్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు, గ్రంథాలయ సిబ్బంది కె.సంపూర్ణమ్మ, జి.శాంసన్, కె.కష్ణవేణి, పి.ఇమ్మానుయేలు, యస్ అనిల్ బాబు, వై. మదుల్ కుమార్ పాల్గొన్నారు.

ఎరిక్షన్‌బాబును సన్మానిస్తున్న దృశ్యం

ఎరిక్షన్‌బాబుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబును రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చెవుల అంజయ్య స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. తనకు డైరెక్టర్ పదవి రావడానికి కృషి చేసిన ఎరిక్షన్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, వెంకటాద్రిపాలెం సర్పంచ్ బోడా శ్రీశైలపతి నాయుడు, నాయకులు వేగినాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యులతో అశోక్ బాబు

వైసిపి గ్రామ కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పల్లికోన, అల్లమూడి, రాచూరు గ్రామాల్లో వైసిపి నూతన గ్రామ కమిటీని వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు అధ్యక్షునితో పాటు నలుగురు ప్రధాన కార్యదర్శిలు, నలుగురు కార్యదర్శులతో కూడిన కమిటీలను నియమించారు. ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై గ్రామస్తుల సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకొని, పార్టీకి విధేయులైన వారిని, గ్రామస్తులు ఎవరినైతే కమిటీ సభ్యులుగా నిర్ణయిస్తారో వారినే గ్రామ పార్టీ కమిటీలో సభ్యులుగా నియమించారు. అతి త్వరలోనే నూతన కమిటీ సభ్యులను అధికారికంగా ప్రకటిస్తామని ఆయన తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామస్థులతో వైసిపి గ్రామ కమిటీని నియమించే విధానాన్ని అవలంబిస్తున్న ఇన్చార్జ్ వరికూటి అశోక్ బాబుకు, నూతన కమిటి సభ్యులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ బి శింగయ్య

విద్యార్థుల స్థితిని తల్లిదండ్రులకు చెప్పాలి

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డిసెంబర్ 7న నిర్వహించతలపెట్టిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి సన్నద్ధత కొరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ బి సింగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రత్యేక అధికారి, జిల్లా అటవీ శాఖ అధికారి భీమయ్య, మున్సిపల్ కమిషనర్ టి రవీంద్ర మాట్లాడారు. తొలుత విద్యా శాఖ కమీషనర్ సూచనల ప్రకారం 12 కమిటీలు ఏర్పాటు చేసుకొని విద్యార్థుల తల్లి, దండ్రులు అందరు హాజరు అయ్యే విధంగా ఉపాధ్యాయులు అందరు సమిష్టి బాధ్యతగా కృషి చేయాలని అన్నారు. సచివాలయ సిబ్బంది సహకారం కూడా ఉంటుందని అన్నారు. ప్రజాప్రతినిధులు అందరిని ఆహ్వానించాలని అన్నారు. తల్లి, తండ్రులకు పోటీలు నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ తల్లితండ్రులకు తెలియ జేయాలని అన్నారు. కమ్యూనిటీ మొత్తం మన పాఠశాల వైపు ఆ రోజు చూసేటట్లు గ్రాండ్‌గా మెగా పిటిఎం నిర్వహించాలని సూచనలు చేశారు.

మాట్లాడుతున్న ఎస్ఐ జివి చౌదరి

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని లారీ డ్రైవర్లు, యజమానులకు డ్రైవింగ్ విషయంలో ప్రమాదాలు జారగ కుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై ఎస్ఐ జివి చౌదరీ స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన కల్పించారు. అధిక లోడుతో లారీ నడిపే సమయంలో డ్రైవర్లు చాలా మెళకువతో ఉండాలని అన్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు ఏవిధంగా తీసుకోవాలనే అంశాలు వివరించారు. కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు, లారీ యజమానులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు సిపిఎం నివాళి

నివాళులు అర్పిస్తున్న సిపిఎం కార్యదర్శి గంగయ్య

పూలే విగ్రహంకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - బాపట్ల

19వ దశాబ్దపు సంఘ సంస్కర్తల్లో జ్యోతిరావు పూలే ఒకరని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా కొత్త బస్టాండ్ వద్ద జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికుల సమస్యలపై పోరాడిన 19వ దశాబ్దపు ఏకైక సంఘ సంస్కర్త పూలే మాత్రమేనని అన్నారు. చిన్నతనంలో జ్యోతిరావు పూలే కూడా పొలంలో వాళ్ల తండ్రి వ్యాపారం అంగడిలో తండ్రికి సహాయంగా ఉండేవాడని, రైతుల సమస్యల పట్ల అవగాహన ఉండేదని అన్నారు. అలనాటి శూద్రులు, అతిశూద్రులు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలతో పాటు రైతు, కార్మిక సమస్యలపై పోరాడేవారని అన్నారు. ముంబైలోని ఖండే అనే నాయకుడితో కలిసి కార్మిక సంఘం నెలకొల్పారని అన్నారు. సామాజిక, ఆర్థిక పోరాటాలు రెండిటినీ ఆయన నిర్వహించారని అన్నారు. అలనాటి రైతు సమస్యలను బ్రిటిష్ పాలకుల దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి పూలే పలు చర్యలు సూచించారని అన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకొని పూలే ఒక పుస్తకాన్ని దాదాపు 150ఏళ్ళ క్రితం రచించారని అన్నారు. అందులో రైతు శ్రమ ఫలితాలను మతాచారాల ద్వారా పురోహితులు, భూ వివాదాలలో రైతులును మోసగించిన కులకర్ణిలు, బ్రాహ్మణులు ఉద్యోగులు అలాగే ప్రభుత్వం వారిని ఎలా దోసుకుంటున్నదో వివరంగా చెప్పారు. సనాతన ధర్మం ఎంత గొప్పదని ఎవరు ఎంత జబ్బలు చరిచిన అది శూద్రులను అతిశూద్రులను ఎలాంటి హక్కులు లేని దాసునిగా మార్చిందనేది దాచి పెట్టలేని నిజమని ప్రచారం చేశారని చెప్పారు. ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక హక్కులు కలిగించడమే మహాత్మ జ్యోతిరావు పూలేకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, కె నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా నాయకులు పి కొండయ్య, ఎన్ బాబురావు, తురిమెళ్ళ కృష్ణమోహన్, సిపిఎం పట్టణ నాయకుడు కె శరత్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : భారతదేశ మొట్ట మొదటి సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎస్‌వి రమణ, ఎఒ జలజ, పిఓపిఆర్డి ఊహారాణి తదితరులు పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. టిడిపి నాయకులు మాచర్ల నాగరాజు, దీపాల ప్రసాదు, యశోద కృష్ణ, అనగాని ఏడుకొండలు ఉన్నారు. వైసీపీ ఇన్‌ఛార్జి వరికుటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో ఎంపిపి డివి లలిత కుమారి, ఒలేరు సర్పంచ్ మెరుగు రంగారావు, నాయకులు జోషి కాంత్, పడమట శ్రీనివాసరావు తదితరులు పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎపిఎం శ్రీమన్నారాయణ, డ్వాక్రా మహిళలు ఉన్నారు.

చీరాల : విద్యా వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని, ఆయన చేసిన సేవలు ఎనలేనివని శాసన సభ్యులు మద్దులూరి కొండయ్య అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గడియారం స్థంభం సెంటర్లోని పూలే విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ కులం పేరుతో తరతరాలుగా అణచివేతకు గురౌతున్న బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తాను అండగా నిలిచాడని అన్నారు. అందరికీ చదువు ఎంతో అవసరమని పాఠశాలలను ప్రారంభించారని అన్నారు. స్త్రీలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడని అన్నారు. వివక్షకు వ్యతిరేకంగా పోరాడి బాల్య వివాహలను రూపు మాపేలా ఉద్యమాన్ని అహర్నిశలు నడిపారని అన్నారు. అలాంటి మహాత్ముడు శారీరకంగా అందరికీ దూరమై నేటికి 129 ఏళ్ల గడిచాయని అన్నారు. తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను, కౌతవరపు జనార్ధన్, డేటా నాగేశ్వరరావు, ప్రజా వేదిక నాయకుల గుమ్మడి ఏసురత్నం పాల్గొన్నారు.

అద్దంకి : స్థానిక మెయిన్ రోడ్డులో ప్రియదర్శిని ఫర్నిచర్ షాప్ వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి కార్యక్రమాన్ని ఎపి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూల మాలతో నివాళులర్పించారు. సామాజిక వివక్ష నిర్మూలించడానికి, అక్షరాస్యతను సాధించడానికి, సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పూలే పోరాటాలు చేశాడని పలువురు వక్తలు అన్నారు. ఆయన జీవితం త్యాగాలమయమని, నేటి తరానికి ఆయన ఎంతో ఆదర్శప్రాయులని కొనియాడారు. కార్యక్రమానికి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు అధ్యక్షత వహించగా రిటైర్ ఆర్జెడి ఉబ్బ దేవపాలన, రిటైర్డ్ హెచ్ఎం చెన్నుపాటి రామాంజనేయులు, రోటరీ ట్రెజరర్ శ్రీనివాసరావు, అన్నంనేని వెంకట్రావు, రిటైర్డ్ టీచర్ నిమ్మరాజు నాగేశ్వరరావు, ఐక్యవేదిక ట్రెజరర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు, కొమ్మలపాటి బుజ్జిబాబు, అంకం నాగరాజు, సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు తాళ్లూరి బాబురావు, జనరాజుపల్లి ప్రభాకరరావు, మంచు హనుమంతరావు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే 134వ వర్ధంతి రోటరీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి రోటరీ సభ్యులు పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకర రావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, పసుపులేటి ఆంజనేయులు, షేక్ మహమ్మద్ రఫీ, అళహరి హరిప్రసాద్, చిన్ని మురళీ కృష్ణ, బి రామ్మోహనరావు పాల్గొన్నారు.

సంతమాగులూరు : గ్రంథాలయ పాలకుడు బాదం విజయ భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన సామాజిక ఉద్యమకారులైన మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విజయ భాస్కరరెడ్డి మాట్లాడుతూ వివిధ సామాజిక సమస్యలతో పాటు రైతు, కార్మిక సమస్యలపై పూలే పోరాటం చేశారని అన్నారు. రైతు కోసం గళ మెత్తిన గొప్ప సంస్కృతి జ్యోతిరావు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో విద్యుత్తు లైన్ మెన్ శ్రీహరి గోపాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న భట్టిప్రోలు ఎంపిడిఒ రమణ

అద్దంకిలో ఘనంగా జ్యోతిరావుపూలే 134వ వర్ధంతి

పాల పదార్థాల్లో కల్తీ జరిగితే కఠిన చర్యలు

డైరీలో పాలపదార్థాలు పరిశీలిస్తున్న ప్రభాకరరావు

ప్రజాశక్తి - అద్దంకి

పాలతో ఉత్పత్తి చేసే ఆహార పదార్థాల్లో కల్తీ జరిగినట్లు నిరూపణైతే అటువంటి పాల కేంద్రాలు, డైరీలపై కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆహార భద్రత అధికారి ప్రభాకరరావు హెచ్చరించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ముండ్లమూరు మండలం పోలవరం పంచాయతీలోని చంద్రగిరి వద్దనున్న శ్రీ రామ్ డైరీలో గురువారం తనిఖీలు చేశారు. పాలకోవా, నెయ్యి, పన్నీరు, పాల పిండిలో కల్తీ జరుగుతున్నట్లు సమాచారం రావడంతో దర్శి సిఐ వై రామారావు, ముండ్లమూరు ఎస్ఐ వై నాగరాజు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ డైరీలో పాలకోవా, పన్నీరు, నెయ్యి పాలపిండి ఇతర పాల పదార్థాలు తయారు చేసి తక్కువ ధరకు తెలంగాణలోని హైదరాబాదులో విక్రయం చేస్తున్నారు. ఆరు రకాల పాల పదార్థాలు శాంపిల్స్ సేకరించి హైదరాబాదు ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఆహార పదార్థాల్లో ఎంత మేరకు కల్తీ జరిగిందని ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. డైరీలో అన్ని విభాగాలను పరిశీలించారు. ఆహార ఉత్పత్తులు చేసే ముడి సరుకులను పరిశీలించారు. ఆహార పదార్థాలు ఎలా తయారు చేస్తారు? ఏమేమి కలుపుతారనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దర్శి సిఐ రామారావు మాట్లాడుతూ పుట్టిన పసిబిడ్డ నుండి చనిపోయే వృద్ధుల వరకు అందరూ పాలు, పెరుగు, నెయ్యి తింటూ ఉంటారని, అటువంటి పాలను రైతులు ఇంటి వద్ద కల్తీ చేస్తున్నారని, అసలు గేదెలే లేకుండా కృత్రిమ పాలు తయారు చేసి పాల కేంద్రాలకు పోస్తున్నారని అన్నారు. పాల కేంద్రాల నుండి వచ్చిన పాలను డైరీ యాజమాన్యం మరికొంత కల్తీ చేస్తున్నారని అన్నారు. ప్రజలందరూ కల్తీ పాలు తాగి రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ఎక్కడైనా పాలు కల్తీ జరిగినట్లు తెలిస్తే పోలీసు అధికారులకు, ఆహార భద్రత అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఎస్ఐ వై నాగరాజు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు నరసింహారావు, శివతేజ పాల్గొన్నారు.

ఆర్డబ్ల్యూఎస్ స్కీమ్ వద్ద చిల్లచెట్లు తొలగింపు

తాగునీటి పథకం చుట్టూ చెట్లు తొలగింపు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని మణికేశ్వరం గ్రామంలోని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం పథకం వద్ద చిల్ల చెట్లను తెలుగుదేశం నేతలు ప్రొక్లయిన్‌తో గురువారం తొలగించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా దారి వెంబడి చెట్లను తొలగించారు. గతంలో ఫిల్టర్ ట్యాంకులు చుట్టూ చెట్లు ఉండటం వలన ఆకులు పడి నీటితొట్లు అపరిశుభ్రంగా ఉండేవని, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో చిల్లచెట్ల తొలగింపు చేపట్టినట్లు ఐటిడిపి అధ్యక్షులు షేక్ కరిముల్లా తెలిపారు. కార్యక్రమంలో అశోక్, మౌలాలి, ఆదినారాయణ, అబ్దుల్లా, కృష్ణ పాల్గొన్నారు.

నోటీసులిచ్చినా ఆగని అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరంలో పది రోజుల క్రితం మురుగు కాలువపై అక్రమంగా కట్టడాన్ని నిర్మిస్తున్న వ్యక్తులకు పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీచేశారు. అయినప్పటికీ కట్టడం మాత్రం ఆగలేదు. గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో ప్రధాన మురుగు కాలువపై ఎలాంటి తూములు లేకుండా కాలువను పూడ్చివేసి అక్రమ నిర్మాణానికి పూనుకున్నారు. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు సంబంధిత నిర్వాహకులకు అప్పుడే నోటీసులు జారీ చేశారు. దీంతో కొన్ని రోజులపాటు కట్టడాన్ని నిలిపివేసి దానిపై బుధవారం రాత్రి ఎక్కడో బయట రేకులతో తయారు చేసుకున్న దుకాణాన్ని జెసిబి ద్వారా తీసుకువచ్చి కట్టడం చేపట్టే దానిపై ఏర్పాటు చేశారు. అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ అధికార పార్టీని అడ్డం పెట్టుకొని చెలాయిస్తున్న కొందరు నాయకులు నోటీసులను సైతం లెక్కచేయలేదు. కనీసం తూములు కూడా ఏర్పాటు చేయకుండా అక్రమంగా నిర్మాణాన్ని ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు విస్మయ వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సదరు అక్రమ నిర్మాణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో మురుగు నీరు పారుదలయ్యే ప్రాంతంలో కనీసం తూములు కూడా లేకుండా అక్రమంగా నిర్మాణం పూర్తి వేసిన సదరు స్థలం వ్యక్తి బట్టు నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. భవిష్యత్తులో మురుగునీటి దుర్గంధం సమస్య ఎదురవుతుందని పేర్కొన్నారు. దీంతో గురువారం రాత్రి ఎస్ఐ అక్రమ కట్టడ ప్రాంతాన్ని పరిశీలించి విచారిస్తున్నారు. తక్షణమే అక్రమ నిర్మాణాన్ని తొలగించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రైనేజీ కాలువపై అక్రమంగా నిర్మించిన దుకాణం

లబ్ధిదారులు ఎన్పీసీఐ లింక్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి

సంక్షేమ పథకాల లబ్ధిదారులు తప్పనిసరిగా ఎన్పీసీఐ లింకు చేయించుకోవాలని ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో ఈ నెల 27నుండి 30వరకు పోస్టల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఎన్పీసీఐ లింక్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు, ఫోన్ నంబరు క్యాంపుల వద్దకు తీసుకువెళ్తే అక్కడి సిబ్బంది ఎన్పీసీఐ లింక్ చేస్తారని చెప్పారు. అలా లింక్ అయిన వారికి మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలకు సంబంధించిన డబ్బులు బ్యాంకు అకౌంట్లో జమ అవుతాయని అన్నారు. అవకాశాన్ని మండలంలోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

30న పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 1న పంపిణి చేసే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు డిసెంబర్ 1న ఆదివారం కావడంతో ఈ నెల 30న శనివారం ఒకరోజు ముందే పంపిణీ చేస్తారని ఎంపిడిఒ బి బాబురావు తెలిపారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు తదితర అన్ని రకాల పెన్షన్లను ఒకరోజు ముందే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ర

1న ఉచిత రక్తనాళాల వైద్య శిబిరం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

స్థానిక ఆర్య, వైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఉచిత రక్తనాళాల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్య, వైశ్య సంఘం మండల అధ్యక్షులు విస్సంశెట్టి శ్రీనివాస రావు తెలిపారు. ఆర్య, వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరంలో దేశంలోనే ప్రముఖమైన ఏషియన్ వాస్కులర్ ఆసుపత్రి వైద్యులచే ఉచితంగా రక్తనాళాల పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఉబ్బిన, మెలి తిరిగిన నరాలు, స్పైడర్ సిరలు, కాళ్లలో రక్తం సరఫరా లేకపోవడం, కాళ్లు, పాదాల వాపు, సోరియాసిస్, మెదడుకు రక్తం సరఫరా సక్రమంగా లేకపోవడం వంటి సమస్యలు ఉన్నవారు ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనవచ్చని తెలిపారు. డిసెంబర్ 1న వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు.

అల్లర్లు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పర్చూరు

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు చేపడతామని బాపట్ల డిఎస్పి రామాంజనేయులు పేర్కొన్నారు. డిఎస్పి గురువారం పర్చూరు పిఎస్ను తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు పెండింగ్ లేకుండా చూడాలని త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఎస్ఐ మాల్యాద్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై ముగ్గుల పోటీ

ప్రజాశక్తి - బాపట్ల

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణా నియంత్రణ విభాగం సంయుక్తంగా గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్ విజయమ్మ తెలిపారు. పోటీల్లో జిల్లాలో పీర్ ఎడ్యుకేటర్స్ హైరిస్కు గ్రూప్, టిఇ ఎన్జీఓఎస్లో పనిచేస్తున్న అవుట్ రిచ్ వర్కర్లు పాల్గొన్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలను ఆమె ప్రకటించారు. విజేతలకు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం డిసెంబర్ 1న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ రోహిణి, ప్రేమ్ పావని, డెమో మరియమ్మ, ఎపి శాక్స్ జిల్లా మేనేజర్ జానిభాష, టిఐ ఎన్జీఓస్ గ్రామసిరి, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

రంగవల్లులను తిలకిస్తున్న ఆరోగ్య జిల్లా అధికారి విజయమ్మ

ప్రతి మహిళ లక్షాధికారి కావాలి

ప్రజాశక్తి - అద్దంకి

ప్రతి మహిళా లక్షాధికారి అవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం రుణ సౌకర్యం కల్పిస్తుందని, సాంకేతిక శిక్షణ ఇప్పించి వారిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా వెలుగు అధికారులు పనిచేస్తున్నారని ఎపిఎం కోటేశ్వరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమైక్య సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధించిన ప్రగతి నివేదికలు సభ్యులకు వెల్లడించారు. బ్యాంకుల నుండి 827 సంఘాలకు రూ.45కోట్లు, శ్రీనిధి రుణాలు 208 సంఘాలకు రూ.5.50కోట్లు, సామాజిక పెట్టుబడి నిధి నుండి రూ.22.25 లక్షలు ఇప్పించినట్లు తెలిపారు. పిఎంఈక్యు పి 11 కింద మండలంలో 10మందికి, పిఎంఎఫ్ఎంఈ పథకం కింద మండలంలో మరో 10మందికి, దీంతోపాటు గేదెలకు 10మందికి మొదటి విడతగా 650మందిని లక్ష్యాధికారులుగా తీర్చిదిద్దుతామని భవిష్యత్తు ప్రణాళిక చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ సంఘం మండల సమైక్యకు నెలకు రూ.500 పొదుపులు చెల్లించాలని తెలిపారు. సభ్యత్వం వాటా దనం ప్రతి సంవత్సరం మండల సమైక్యకు రూ.1500 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో విఒ, అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి, సీసీలు, అకౌంటెంట్లు హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతునన ఎపిఎం కోటేశ్వరరావు

అంతర్జాతీయ అథ్లెటిక్స్‌కు సత్కారం

ప్రజాశక్తి - చీరాల

పశ్చిమ బెంగాల్‌లోని పుంచ్ బీహార్‌లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో చీరాలకు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారులు, హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ నాగరాజు, ఎ సాంబశివరావు బంగారు పతకాలు సాధించారు. నాగరాజు షాట్ పుట్‌లో బంగారు పతకాన్ని, జావలిన్ త్రోలో వెండి పతకాన్ని సాధించారు. సాంబశివరావు 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో బంగారు పతకాన్ని సాధించారు. సందర్భంగా స్థానిక ఇండోర్ షటిల్ స్టేడియంలో ఇరువురు క్రీడాకారులను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ హనుమాన్ మాట్లాడుతూ చీరాల పట్టణం క్రీడాకారులు, కళాకారులకు పుట్టినిల్లని కొనియాడారు. భవిష్యత్తులో వారు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ ఐ బాబురావు, డాక్టర్ శంకరరెడ్డి, ఊటుకూరు సత్యనారాయణ, మూర్తి, రామ్ కుమార్, కేదార్నాథ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో విజేతలను సత్కరిస్తున్న స్టేడియం ప్రతినిధులు

హనుమంతరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఆదర్శనీయుడు హనుమంతరావు

ప్రజాశక్తి - మెదరమెట్ల

హనుమంతరావు ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తూ కొరిసపాడు మండలం తిమ్మనపాలెం గ్రామంలోని ఆరివారి జిల్లా పరిషత్ పాఠశాల్లో ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా గురువారం సన్మాన సహ ఏర్పాటు చేశారు. సభలో పలువురు వక్తలు మాట్లాడారు. సయంపు హనుమంతరావు ఆంగ్ల బోధకునిగా అంకిత భావంతో పనిచేసి ఎందరో విద్యార్థినీ, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని అన్నారు. అతని శేష జీవితం సుఖ సంతోషాలు, ఆనందాలతో ముందుకు నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - చీరాల

నాటు సారా తయారీకు పాల్పడిన, అమ్మిన చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఎక్సైజ్ సిఐ నాగేశ్వ రావు హెచ్చరించారు. పట్టణంలోని రామనగర్‌లో నాటు సారా తయారీ స్థావరాలపై గురువారం పోలీసులు శాఖ డిప్యూటీ కమిషనర్, ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటు సారా తయారీకి ఉపయోగించే 450 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎస్టిఎఫ్ అధికారి ఇఎస్, ఎన్ఫోర్స్‌మెంట్ ఎఇఎస్, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ ఈఎస్టిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న డిపిఒ విజయరాణి

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని దోనేపూడి అంగన్‌వాడీ సెక్టార్ ఆధ్వర్యంలో పోతర్లంక గ్రామంలో బాల్య వివాహాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి డిపిఓ విజయరాణి మాట్లాడారు. 18 సంవత్సరాల్లోపు ఆడ పిల్లలకు వివాహం చేస్తే బాల్య వివాహం అవుతుందని, చట్టరీత్య నేరమని అన్నారు. అలాంటి వివాహాలు చేయకుండా నిషేధించాలని ప్రజలకు అవగాహన కలిపించారు. అనంతరం పోతార్లంక గ్రామంలో ప్రజల చేత ప్రమాణాలు చేయించారు. కార్యక్రమంలో ధోనేపూడి సెక్టార్ సూపర్వైజర్ పి నాగరాజుకుమారి, అంగనవాడి సిబ్బంది, విద్యార్థులు, వారు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు 33 కేంద్రాలు

- రవాణాకు వాహనాలు సిద్ధం చేయాలి
- రూ.11 కోట్ల బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించాలి
- రైస్ మిల్లర్స్‌కు జేసీ ఆర్.గోపాలకృష్ణ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు 33 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక జెసి ఛాంబర్‌లో గురువారం 2024-25 సంవత్సరానికి ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైస్ మిల్లర్స్‌తో జేసీ సమావేశం నిర్వహించారు. 13 మంది రైస్ మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్స్‌లో పాల్గొనటానికి అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో రైతులు 23,504 ఎకరాలలో వరి పంటను సాగుచేశారని, 59547 మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు 33 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 2024-25వ సంవత్సరానికి ధాన్యం సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,300, గ్రేడ్ ఏ రకానికి రూ.2320 ప్రభుత్వం మద్దతు ధరగా నిర్ణయించిందన్నారు. రైతు భరోసా కేంద్రాలలో ధాన్యాన్ని కొనుగోలుకు కావలసిన గోనె సంచులు ఏర్పాటు చేయాలని సంయుక్త కలెక్టర్ మిల్లర్లను ఆదేశించారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జి. వరలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.పద్మశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ బి. శ్రీనివాస రెడ్డి, ప్రకాశం జిల్లా రైస్ మిల్లర్స్ పాల్గొన్నారు.

పూలేకి బూచేపల్లి నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పూలేకి నివాళులర్పిస్తున్న బూచేపల్లి, వైసిపి నేతలు

బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో సేవ చేసిన వ్యక్తి జ్యోతి రావు పూలే అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఒంగోలు జిల్లా పార్టీ ఆఫీస్‌లో పూలే వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి.. ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, బాలికా విద్య స్త్రీల హక్కులు, అణగారిన జాతులకు ఉచిత విద్యా బోధన తో పాటు దేశం లో మొదటగా మహిళా స్కూల్ ను ఏర్పాటు చేసి వారి విద్యకు నాంది పలికిన వ్యక్తి పూలే అని అన్నారు. దళితులు, వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఒంగోలు ఇంఛార్జి చుండూరి రవి, పట్టణ పార్టీ అధ్యక్షులు కఠారి శంకర్, మాజీ ఎంఎల్‌ఏ ఆదెన్న, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు ప్రసాద్, బి.సి జోనల్ ఇంఛార్జి రామారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

నారావారిపల్లెలో జరిగిన నారా రామ్మూర్తినాయుడు దశదిన కర్మ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్న ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు, రాష్ట్ర మారిటం చైర్మన్ దామచర్ల సత్య

పూలే ఆశయ సాధనకు కృషి

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహాత్మా జ్యోతి బా పూలే వంటి మహనీయుల అడుగుజాడల్లో నడుచుకుంటూ వారి ఆశయాల సాధన అందరి బాధ్యతలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, వికలాంగులు, వయోవృద్ధులు, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిభా పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఉదయం ఒంగోలు కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతి బా పూలే విగ్రహానికి రాష్ట్ర మంత్రి డిబివి స్వామి, కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, ఎపి టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, వివిధ బిసి సంఘాల ప్రతినిధులతో కలసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ మహాత్మా జ్యోతి భా పూలే సమాజానికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు.

సమ సమాజ స్థాపన స్ఫూర్తిదాత

సాంఘిక సంఘ సంస్కర్త సమ సమాజ స్థాపన స్ఫూర్తిదాత మహాత్మా జ్యోతి బా పూలే అని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు మహాత్మా జ్యోతి బా పూలేను ఆదర్శంగా తీసుకొని ప్రకాశం జిల్లాను ఒక సమ సమాజ సమగ్రాభివద్ధికి, వంద శాతం అక్షరాస్యత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. ఎపి టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, సామాజిక వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా 200 సంవత్సరాల క్రితమే పోరాడిన మహనీయులు మహాత్మా జ్యోతి బా పూలే అని తెలిపారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ 200 సంవత్సరాల క్రితమే సాంఘిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహెూన్నత వ్యక్తి మహాత్మా జ్యోతి బా పూలే అని తెలిపారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వర రావు, సోషల్ వెల్ఫేర్ డిడి ఎం.లక్ష్మా నాయక్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి అంజల, ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వర రావు, ఎస్ సి కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు నీలం నాగేంద్రరావు, గంటా సుబ్బారావు, దారా అంజయ్య, బంకా చిరంజీవి పాల్గొన్నారు.

పూలేకు నివాళులర్పిస్తున్న బాపట్ల కలెక్టర్ వెంకటమురళి

ప్రజా ఉద్యమకారుడు పూలే

బాపట్ల జిల్లా : ప్రజా ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కలెక్టర్ జె వెంకటమురళి తెలిపారు. మహాత్మా జ్యోతి రావు పూలే 134వ వర్ధంతి కార్యక్రమం గురువారం బాపట్లలో జరిగింది. స్థానిక పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు విద్య అవసరమని గుర్తించిన మేధావిగా పూలేను అభివర్ణించారు. ప్రజలలో చైతన్యం తెచ్చిన మహనీయులని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో పి గ్లోరియా, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారి రాజేష్ దాసు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాష్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

భారత రాజ్యాంగంపై అందరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని జన విజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయప్రకాష్ తెలిపారు. రాజ్యాంగ వజ్రోత్సవా లను పురస్కరించుకొని జెవివి ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న రాజ్యాంగ ప్రచార వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక నారాయణ పబ్లిక్ స్కూల్ లో 'భారత రాజ్యాంగం విశిష్టత' పై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి ప్రవేశిక కీలకమైందని, రాజ్యాంగ స్వరూప స్వభావాలను, మౌలిక అంశాలను ప్రతిబింబిస్తుందన్నారు. జెవివి ఒంగోలు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్‌వి రంగారెడ్డి, ఎన్‌టి వెంకటేశ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ప్రజాస్వామ్యం, సామ్యవాదం, లౌకిక తత్వం, సమాఖ్య విధానం, స్వేచ్ఛ, సమానత్వం వంటి అంశాలు కీలకమైనవన్నారు. నారాయణ హై స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణు మాట్లాడుతూ విద్యార్థులు రాజ్యాంగంలో పేర్కొనబడిన పౌరుల ప్రాథమిక హక్కులు, విధులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఉపన్యాస పోటీలలో విద్యార్థులు ఆసక్తిగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపక బందం విద్యార్థులతో రాజ్యాంగ ప్రవేశిక చదివించారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెవివి ప్రతినిధులు

పది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలను నిర్దేశించిన లక్ష్యం మేరకు డిసెంబర్ 10 నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలసి గహ నిర్మాణాల పురోగతిపై, ఎంఎస్ఎంఈ(సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల స్థాపన)కు సంబంధించిన సర్వే, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, స్కూల్ టాయిలెట్స్ ఇన్‌స్పెక్షన్ వంటి అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, ఏపీడీ, ఎపిఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పేద కుటుంబాల ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 12 తేదీన లక్ష ఇళ్ళను సామూహికంగా ప్రారంభోత్సవాలు చేపడుతుండటంతో జిల్లాలో 3,800 ఇళ్ల నిర్మాణ లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 1436 ఇళ్ళు పూర్తి చేశామన్నారు. మిగిలిన ఇళ్ళ నిర్మాణాలను రోజువారీ లక్ష్యాలను నిర్ధేశించుకొని డిసెంబర్ 10 నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ కు (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల స్థాపన) సంబంధించిన సర్వే పక్కాగా జరగాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న వాణిజ్య, వ్యాపార, సేవా రంగ సంస్థలు, ఉత్పత్తి దారులకు ఎంఎస్ఎంఇ సర్వేపై పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. సర్వేలో భాగంగా గ్రామ పంచాయితీ సచివాలయం, వార్డు సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో మొబైల్ యాప్ ద్వారా సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. సర్వే ప్రక్రియలో ఆయా పరిశ్రమకు సంబంధించిన ఉపాధి కల్పన, టర్నోవర్, ప్రస్తుతం అందుతున్న బ్యాంకుల రుణాల సదుపాయాలు, రాయితీలు వంటి వివరాలను సర్వే యాప్ ద్వారా పొందు పరిచాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మంజురైన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, పరిశ్రమల శాఖ జిఎం శ్రీనివాస రావు, జడ్పీ సిఇఒ బి.చిరంజీవి, డ్వామా పీడీ కె.జోసఫ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖాదికారి డాక్టర్ ఎస్. శ్రీనివాస రావు హాజరయ్యారు. క్షేత్ర స్థాయి నుండి మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా